ఎల్లారెడ్డిపేట: గుండారంలో శంకర్‌ను పరామర్శించి ఓదారుస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్

ఎల్లారెడ్డిపేట: అల్మాస్‌పూర్ మల్లికార్జునస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

# బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్

- వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల్లో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం
- పార్లమెంట్ ఎన్నికలపై దిశానిర్దేశం చేసిన వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కరీంనగర్ ఎంపీగా వినోద్‌కుమార్‌ను గెలిపించాలని పిలుపు

ఎల్లారెడ్డిపేటలో సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

సిరిసిల్ల/వీర్నపల్లి/ ఎల్లారెడ్డిపేట, మార్చి 9: సిరిసిల్ల నియోజకవర్గంలోని ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో శనివారం బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎల్లారెడ్డిపేటలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వర్స కృష్ణహరి ఆధ్వర్యంలో సాయిశివ గార్డెన్‌లో, వీర్నపల్లి రైతు వేదిక సమీపంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశాలకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హాజరయ్యారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కష్టపడి పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. కరీంనగర్ ఎంపీగా బోయినపల్లి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. రామన్న ప్రసంగంతో పార్టీ శ్రేణుల్లో జోష్ నెలకొన్నది. కార్యక్రమంలో పార్లమెంట్ ఎన్నికల సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి తుల ఉమ, రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, జడ్పీటీసీలు చీటి లక్ష్మణ్‌రావు, గుగులోత్ కళావతి, ఎంపీపీలు పిల్లి రేణుక, మాలోత్ భూల, సెస్ డైరెక్టర్ మాడ్గుల మల్లేశం, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు చాంద్ పాషా, బంజారా సంఘం రాష్ట్ర నాయకుడు గుగులోత్ సురేశ్‌నాయక్, మహిళా విభాగం మండలాధ్యక్షురాలు గుగులోత్ కళ, యువజన విభాగం మండలాధ్యక్షుడు సామల్ల దేవరాజు, పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, ఎంపీటీసీ నాగరాణి, నాయకులు ఎడ్ల సాగర్, శ్రీరాంనాయక్, బోయిని రవి, భాస్కర్, అశోక్, సంతోష్, దినకర్, నాగరాజు, అజయ్, మల్లేశ్, అందె సుభాష్, కుంబాల మల్లారెడ్డి, శివకుమార్, మామిండ్ల తిరుపతి, బాల్‌రెడ్డి, అనసూయ, గీతాంజలి పాల్గొన్నారు.

### మల్లికార్జున ఆలయంలో పూజలు

అల్మాస్‌పూర్‌లో మల్లికార్జున స్వామి కల్యాణమహోత్సవానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. ఇక్కడ ఎంపీపీ పిల్లి రేణుక ఉన్నారు.

### కార్యకర్తకు ఓదార్పు...

ఎల్లారెడ్డిపేట మండలం గుండారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త భూక్యా శంకర్‌నాయక్‌కు ఇటీవల ఓపెన్ హార్ట్ సర్జరీ కాగా, ఆయనను కేటీఆర్ పరామర్శించారు. ఇబ్బందులేమున్నా తనకు తెలిపితే కాపాడుకుంటానని భరోసానిచ్చారు. ఇక్కడ ఎంపీటీసీ వరద బాబు, గణేశ్, రాజ్‌కుమార్ ఉన్నారు.

### బీఆర్ఎస్‌తోనే తండాల్లో ప్రగతి: రాథోడ్

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే తండాల్లో ఎనలేని ప్రగతి జరిగిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జాన్సన్ రాథోడ్‌నాయక్ పేర్కొన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ విజ్ఞప్తి మేరకు బంజారా (గోర్‌బోలీ) భాషలో ప్రసంగించారు. ఆయన మాటలు తెలుగులో గిరిజనులకు ఆరు నుంచి పది శాతం రిజర్వేషన్‌ను తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పెంచారన్నారు. 500జనాభా ఉన్న ప్రతి తండాలను గ్రామ పంచాయితీగా మార్చారని పేర్కొన్నారు. గిరిజనులకు పోడు పట్టాలు ఇవ్వడమే కాకుండా, సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించారని కొనియాడారు. అంబేద్కర్ ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్‌తో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు విదేశీ విద్య అభ్యసించడానికి రూ.20లక్షల సాయం అందించిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ గొంతు వినిపించాలంటే రానున్న ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీగా వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

### నేడు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

గంభీరావుపేట, మార్చి 9: గంభీరావుపేట బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాన్ని ఆదివారం మండల కేంద్రంలో మధ్యాహ్నం 3గంటలకు నిర్వహిస్తున్నామని మండలాధ్యక్షుడు పాపాగారి వెంకటస్వామిగౌడ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య హాజరవుతారని తెలిపారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### వినికిడి మిషన్లు అందించండి..

గంభీరావుపేట, మార్చి 9: గజసింగవరం లో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు నివాసానికి శనివారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ వచ్చారు. ఈ సందర్భంగా రామన్నను రాజేశ్వర్‌రావునగర్‌కు చెందిన చల్ల లావణ్య-శ్రీనివాస్ దంపతులు కలిశారు. తమ ఇద్దరు కూతుళ్లు రోషిణి(13), అశ్విణి(11) మూగ చెవిటి సమస్యతో బాధపడుతున్నారని, వారికి వినికిడికి మిషన్లు సమకూర్చాలని కోరారు. దీంతో కేటీఆర్ స్పందించి, వెంటనే అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు రామన్నకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

గంభీరావుపేట: వినికిడి మిషన్లు అందించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్‌కు విన్నవిస్తున్న లావణ్య దంపతులు

# వెళ్లొస్తాం రాజన్న.. మళ్లొస్తం

- ముగిసిన మహా శివరాత్రి వేడుకలు
- తిరుగుపయనమైన భక్తులు
- మూడు లక్షలకుపైగా దర్శనం
- సమకూరిన ₹98.28లక్షల ఆదాయం

తిరుగుపయనంలో రాజన్న ఆలయం వద్ద స్వామివారికి దండం పెడుతున్న భక్తులు

వేములవాడ టౌన్, మార్చి 9: మూడు రోజులపాటు వేములవాడ రాజన్న సన్నిధిలో అంగరంగ వైభవంగా నిర్వహించిన మహాశివరాత్రి జాతర వేడుకలు శనివారంతో ముగిశాయి. ఎల్లొస్తం రాజన్న.. మళ్లొస్తం.. మా పిల్లాజెల్లాని సల్లంగసూడు.. అంటూ భక్తులు ఆలయ ముఖద్వారం ఎదుట రాజన్నకు దండాలు పెట్టి.. ఇంటికి తిరుగుముఖం పట్టారు. మహా శివరాత్రి జాతర సందర్భంగా లక్షలాది మందితో కిటకిటలాడిన వేములవాడ వీధుల న్నీ భక్తుల తిరుగుపయనంతో వెలవెలబోయాయి. మూడు రోజుల్లో స్వామివారిని మూడు లక్షలకుపైగా భక్తులు దర్శించుకోగా, ₹98.28లక్షలకుపైగా ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు తెలిపారు. అందరి సహకారంతోనే జాతర విజయవంతమైందని, ఇందుకు సహకరించిన అందరికీ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఈవో కృష్ణప్రసాద్ కృతజ్ఞతలు చెప్పారు.

### అందరి కృషితోనే సక్సెస్: విప్, ఈవో

అందరి సహకారం, సమన్వయంతో మహాశివరాత్రి జాతర విజయవంతమైందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. ₹4.5 కోట్లతో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో ఉంటూ పర్యవేక్షించిన ప్రజాప్రతినిధులు, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్‌మహాజన్, ఆలయ ఈవో కృష్ణప్రసాద్, అధికారులకు విప్ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మూడురోజులుగా భక్తులకు అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని, ఇందుకు సహకరించిన అధికారులు, ఉద్యోగులు, మీడియా మిత్రులకు ఈవో కృతజ్ఞతలు తెలిపారు.

### జాతర ఆదాయం ₹98.28లక్షలు

మహా శివరాత్రి జాతర సందర్భంగా ఆలయానికి వివిధ ఆర్జిత సేవల ద్వారా ₹98లక్షల 28,992 ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో కృష్ణప్రసాద్ వెల్లడించారు. ఈ నెల 7న గురువారం ₹24లక్షల 22వేల 392, 8న ₹74 లక్షల 6,600 సమకూరిందని తెలిపారు. జాతరకు సుమారు మూడు లక్షలకు పైగా భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారని ఈవో చెప్పారు.

వెంకటాపూర్‌లో ట్యాంకర్‌తో పొలానికి నీళ్లు పడుతున్న రైతు రాజయ్య

## ఎండుతున్న పొలం.. ట్యాంకర్ నీరే ఆధారం

ఎల్లారెడ్డిపేట, మార్చి 9: వెంకటాపూర్‌కు చెందిన చాకలి రాజయ్య రెండెకరాల్లో వరి వేశాడు. పొట్టకొచ్చిన దశలో భూగర్భజలాలు ఇంకిపోయి బోరు ఎత్తిపోయింది. దీంతో చేసేదేమీలేక వారం నుంచి ప్రతిరోజూ ₹1,600 వెచ్చించి వాటర్ ట్యాంకర్ ద్వారా నీరందిస్తున్నాడు. చేతికొచ్చే దశలో ఎండుతున్న పంటను చూడలేక పైసలు పెట్టి మరి నీరందిస్తున్నాడని రాజయ్య చెప్పాడు. మరో 20 రోజులు నీళ్లు పెట్టాల్సి ఉంటుందని, ఇట్లయితే పెట్టుబడి కూడా చేతికి రాదని ఆవేదన వ్యక్తం చేశాడు. గ్రామంలో వరి వేసిన 500 ఎకరాల్లో కూడా పంటలు ఎండిపోతున్నాయని చెప్పాడు.

# కల్యాణం.. కమనీయం

- నేత్రపర్వంగా శివపార్వతుల కల్యాణమహోత్సవం
- ప్రత్యేక పూజలు చేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కోనరావుపేట: మామిడిపల్లిలో శివపార్వతుల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

కోనరావుపేట/చందుర్తి, మార్చి 9: కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలోని శ్రీ మహాదేవ శివాలయంలో శనివారం శివపార్వతుల కల్యాణమహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. అలయ కమిటీ ఆధ్వర్యంలో కల్యాణ వేదికను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేయగా, అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తులకు పట్టువస్త్రాలతో అలంకరించారు. ముందుగా స్వామివారి ఎదుర్కోలు ఘట్టాన్ని నిర్వహించారు. అనంతరం స్వామివారు కల్యాణోత్సవం జరిపించగా, భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి వీక్షించారు. కట్నకానుకలు సమర్పించి, కుటుంబ సమేతంగా మొక్కులు చెల్లించుకున్నారు. తర్వాత భక్తులకు అన్నదానం చేశారు. ఇక్కడ ఆలయ కమిటీ చైర్మన్ తీపిరెడ్డి మల్లారెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ ముత్యాల కిషన్‌రెడ్డి, మాజీ సర్పంచులు కొక్కుల భారత, పన్నాల విజయ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ విప్ ప్రత్యేక పూజలు

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శివపార్వతుల కల్యాణ మహోత్సవానికి హాజరయ్యారు. ముందుగా ఆలయంలో పూజలు చేయగా, అర్చకులు తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సత్కరించారు.

### ఎన్గల్ శివాలయంలో ..

చందుర్తి మండలం ఎన్గల్‌లోని రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో శనివారం స్వామివారి కల్యాణమహోత్సవం జరిపించగా, భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. శివుడి ఆశీస్సులతో ప్రజలందరూ చల్లగా ఉండాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా విప్‌ను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు, వేడుకల్లో జడ్పీటీసీ నాగం కుమార్, నాయకులు ఏనుగంటి శంకర్, గసికంటి ప్రభాకర్, గంగాధర్, లండే తిరుపతి, సత్యం, పొన్నాల శ్రీనివాసరావు, తిప్పని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా మహా జాతర

రుద్రంగి, మార్చి 9: మండల కేంద్రంలోని అడవి ప్రాంతంలో గల శ్రీ బుగ్గ రాజరాజేశ్వర స్వామివారి మహా జాతర శనివారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ వేడుకకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జడ్పీటీసీ గట్ల మీనయ్య, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.



చందుర్తి: ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

## 'కదనభేరి' పోస్టర్ ఆవిష్కరణ

కదనభేరి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చిక్కాల రామారావు, నాయకులు

సిరిసిల్ల రూరల్, మార్చి 9: కరీంనగర్ జిల్లాలో ఈ నెల 12న బీఆర్ఎస్ కదనభేరి బహిరంగ సభ నిర్వహించనుండగా, ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం మండల కేంద్రంలో సెస్ చైర్మన్ చిక్కాల రామారావు ఆవిష్కరించారు. ఇక్కడ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, పీఏసీఎస్ చైర్మన్లు బండి దేవదాస్, కోడూరి భాస్కర్‌గౌడ్, మండల నాయకులు పడిగెల రాజు, బండి జగన్, హమీద్, మదన్, సిలువేరు నర్సయ్య, భాస్కర్, అనిల్, రమేశ్, తదితరులు ఉన్నారు.

## కౌన్సిలర్ల సస్పెన్షన్

వేములవాడ, మార్చి 9: వేములవాడ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థికి కాకుండా వ్యతిరేకంగా ఓటేసిన ఐదుగురు కౌన్సిలర్లను సస్పెండ్ చేసినట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యతిరేకంగా ఓటేసిన రెండుమిద్దెల జయ, జడల లక్ష్మి, యాచమనేని శ్రీనివాసరావు, ముప్పిడి సునంద, మధురా జేందర్‌శర్మను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిపారు. మిగతా వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## 15 బహిరంగ వేలం

వేములవాడ రూరల్, మార్చి 9: అగ్రహారంలోని హనుమాన్ ఆలయంలో కొబ్బరి ముక్కలు పోగు చేసుకునేందుకు ఈ నెల 15న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో మారుతి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెండర్‌లో పాల్గొనేవారు లక్ష రూపాయల డిపాజిట్ చెల్లించాలన్నారు.

## కోనరావుపేటలో చోరీ

కోనరావుపేట, మార్చి 9: పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన సామ నరసింహారెడ్డి ఈ నెల 8న కూరగాయలు విక్రయించేందుకు పక్క ఊరికి వెళ్లాడు. ఈ క్రమంలో దుండగులు ఇంట్లో చొరబడి బీరువా లోని ₹50వేలు, అర్ధతులం బంగారం ఎత్తుకెళ్లారని బాధితుడు ఠాణాలో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

# ఘనంగా మహిళా దినోత్సవం

వేములవాడ రూరల్: కేక్ కట్ చేస్తున్న వైస్ ఎంపీపీ, మహిళలు

గంభీరావుపేట: పోషవ్వను సన్మానిస్తున్న కుటుంబ సభ్యులు

వేములవాడ రూరల్, మార్చి 9: వేములవాడ రూరల్ మండలం ఫాజుల్‌నగర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, మహిళా దినోత్సవాన్ని జరుపుకొన్నారు. అలాగే ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా సంఘం సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జక్కుల కవిత, నాయకుడు జక్కుల తిరుపతి, కార్యదర్శి రాఘవరావు, ఏఎన్ఎంలు లత, రాజేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు విజయ, రాజేశ్వరి, వీవోఏలు జలజ, రాధ, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీను, మహిళా సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట, మార్చి 9: నర్మాలకు చెందిన మరాఠి పోషవ్వ తన భర్త రాజయ్యతో కలిసి కూలి పనిచేసి తన పిల్లలను చదివించింది. కుటుంబంలోని ముగ్గురు కొడుకులు, ఇద్దరు కూతురులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. మాతృదినోత్సవాన్ని పురస్కరించుకొని తమ కోసం కష్టపడిన తన తల్లికి సన్మానించి, ఆశీర్వాదాలు తీసుకున్నారు.

## మహిళ దారుణ హత్య

మల్లవ్వ (ఫైల్)

వీర్నపల్లి, మార్చి 9: మహిళ దారుణ హత్యకు గురైన ఘటన వీర్నపల్లి మండలం వన్‌పల్లిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన శివరాత్రి మల్లవ్వ (42) భర్త, కుమారుడు వేర్వేరు గ్రామాల్లో ఉంటున్నారు. కొన్ని రోజులుగా తల్లిగారింట్లో మల్లవ్వ ఒంటరిగా ఉంటున్నది. రోజు మాదిరిగానే శుక్రవారం రాత్రి ఇంట్లో నిద్రపోగా, తెల్లవారేసరికి రక్తపుమడుగులో కనిపించింది. గుర్తు తెలియని వ్యక్తులు మల్లవ్వ గొంతుకోసి దారుణంగా హత్య చేశారు. స్థానికుల సమాచారం మేరకు డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐలు రమాకాంత్, రమేశ్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీం సిబ్బంది ఆధారాలు సేకరించారు. మల్లవ్వ సోదరుడు రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేశ్ పేర్కొన్నారు.

## క్రికెట్ టోర్నీ ప్రారంభం

కోనరావుపేట, మార్చి 9: ధర్మారంలో దశరథ సేంద్రియ వ్యవసాయ క్షేత్రం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వాహకుడు కిషన్ శనివారం ప్రారంభించారు. యువకులు క్రీడల్లో రాణించి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆయన సూచించారు. ఈ టోర్నీలో 60 జట్లు తలపడనుండగా, విజేతకు ₹20వేలు, రన్నరప్‌కు ₹10వేల నగదు తోపాటు కప్‌ను బహూకరించనున్నట్లు వెల్లడించారు. ఇక్కడ గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

## ఎక్సైజ్ సీఐలకు సన్మానం

ఎల్లారెడ్డిపేట, మార్చి 9: ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సీఐగా ఆరున్నరేండ్ల పాటు సేవలందించిన ఎంపీఆర్ చంద్రశేఖర్‌ను శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో సిబ్బంది సన్మానించారు. సీఐగా ఆయన చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. అనంతరం బదిలీపై వెళ్తున్న చంద్రశేఖర్, కొత్త సీఐ ఎం శ్రీనివాస్‌ను సత్కరించారు. ఇక్కడ ఎస్ఐ ప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ సర్దార్‌ఆలీ, కానిస్టేబుళ్లు ఉన్నారు.

## భక్తులకు అన్నదానం

సిరిసిల్ల రూరల్, మార్చి 9: మండల కేంద్రంలోని పురాతన శివాలయంలో మహా శివరాత్రి వేడుకలు నిర్వహించారు. పీఏసీఎస్ వైస్‌చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణారెడ్డి-నవ్య దంపతులు అన్నదానం చేయగా, ఎంపీపీ పడిగెల మానస ప్రారంభించారు. ఇక్కడ పీఏసీఎస్ చైర్మన్లు బండి దేవదాస్, కోడూరి భాస్కర్‌గౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజన్న, నేతలు అంకారపు రవీందర్, రామాగౌడ్, దుర్గాప్రసాద్, నర్సయ్య, ఆంజనేయులు, లావణ్య, జయశ్రీ, సంధ్యారాణి ఉన్నారు.

## కేక్ కోసి.. స్వీట్లు పంచి..

ఇల్లంతకుంట, మార్చి 9: మండల కేంద్రంలో జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు జన్మదిన వేడుకలను మండల బీఆర్ఎస్ నాయకులు శనివారం ఘనంగా జరుపుకొన్నారు. కేక్ కట్ చేసి.. స్వీట్లు పంచిపెట్టారు. నిండునూరేండ్లుగా ఆయురారోగ్యాలతో బాగుండాలని సిద్ధం వేణుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## సమ్మేళనానికి తరలి రావాలి

గంభీరావుపేట/ముస్తాబాద్, మార్చి 9: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఆదివారం నిర్వహించే గౌడ సంఘ ఆత్మీయ సమ్మేళనానికి మండలం నుంచి సంఘం సభ్యులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని జిల్లా నాయకుడు మేర్గు యాదగిరిగౌడ్ పిలుపునిచ్చారు. శనివారం గంభీరావుపేట, ముస్తాబాద్ మండలాల్లో ఆత్మీయ సమ్మేళన పోస్టర్‌ను సంఘం సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. సమ్మేళనంలో భాగంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను సన్మానించనున్నట్లు తెలిపారు. ఇక్కడ సంఘ నాయకులు జగన్‌గౌడ్, వెంకటేశంగౌడ్, దేవదాస్‌గౌడ్, దేవరాజుగౌడ్, తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073. NT-311806-All

★ఇంటర్, డిగ్రీ చదివి ఖాళీగా ఉన్న వారికి కంప్యూటర్ & ఇంగ్లీష్ కోర్సులు నేర్పి, కార్పొరేట్ సంస్థలలో ఉద్యోగ అవకాశాలు చూపించబడును. 7997997364/5. NT-327958-All

కోర్టు కేసులు

★మీరు మీ కోర్టు కేసులతో బాధ పడుతున్నారా? NOC ఇబ్బందులు ఉన్నాయా? ఎంత క్లిష్టమైన కేసులైనా తక్కువ Feesతో నమ్మకమైన లాయర్‌తో Solve చేస్తాం. GLS, L.B.నగర్, Hyd. 7893011777. NT-311861-All

CHANGE OF NAME

★I, DUSA RANJITA PRABHAKAR, R/o. 3-93/2/A/1, Road No. 8, Revenue Colony, Theegalaguttapally, Karimnagar, TS. Changed My Name as ANMANDLA RAMYASREE, W/o. Munendar Prasad. NT-319479

★I, TIKKALA NAGARAJU, S/o. Tikkala Limbaiah, R/o. 1-116, Marrimadla, Rajanna Sircilla, TS. have Changed My Name as THIKKALA NAGARAJU, S/o. Thikkala Limbaiah. NT-319479

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194